# అనగనగా ఒక కథ

జ్ఞం

# ఒకరికొకరు

**పూర్ణకి దుఃఖం ఆగడం లేదు. ఎంత కంట్రోలు చేసుకుందామనుకున్నా బయటపడిపోతోంది.**

''ఏమైంది పూర్ణా?''

''ఏం లేదు- బానే వున్నాను కదా!''

''కాదు..నీలో ఏదో తేడా కన్పిస్తోంది''

''తేడాలేంటో తరువాత చెబ్దురు గానీ..ముందు టిఫిన్ చేయండి! ఆఫీసు టైం అవుతోంది''

గొంతు వణికినట్టుంది పూర్ణది.

అనుమానంగా చూస్తూనే...మౌనంగా టిఫిన్ ముగించి ఆఫీసుకు బయల్దేరాడు మధుసూదన్.

పొద్దున్న అనవసరంగా పేపర్ చదివింది.

రోజూ- మధు వెళ్లాక పేపర్ చదివే పూర్ణ...టిఫిన్ తయారయ్యాక కూడా మధు లేవలేదని..పేపర్ తిరగేసింది.

రాజు పెళ్ళి వార్త.

రాజు పెళ్ళి గురించి పేపర్లో వేయాల్సినంత పెద్ద విషయమే.

అతను ఏడు సినిమాలు-వరుసగా హిట్ కొట్టిన టాప్ డైరెక్టర్- పెళ్ళి చేసుకున్న అమ్మాయి కూడా తక్కువదేం కాదు..ఆవిడ కూడా పెళ్ళి వార్త రాయాల్సినంత గొప్ప వ్యక్తే.

ఇద్దరూ సింపుల్‌గా గుళ్ళోపెళ్ళి చేసుకున్నా పనున్నట్టు-ప్రెస్ వాళ్ళూ..వీడియో వాళ్ళూ చుట్టుముట్టి ఫోటోలు కొట్టి, తోరణాలు కట్టి, వార్త ప్రచురించారు.

చాలామందికి ఈ శుభవార్త ఆనందాన్ని కలిగించి వుంటుంది.

పూర్ణకు మాత్రం..గతం గుర్తొచ్చి గుండె కలుక్కుమంటోంది.

రాజు పెళ్ళి చేసుకున్న అమ్మాయి మాత్రం..తనంత అందమైంది కాదు.

కానీ రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న గాయని...రేఖ-

ఒకప్పుడు ఆవిడ పాటలు విని తనూ ఆనందించేది.

చిన్నతనంలోనే అన్నమయ్య కీర్తనల ద్వారా, జానపద గీతాల ద్వారా పాపులర్ అవుతున్న రేఖను చూసి, పొందుతున్న బహుమతుల్ని చూసి..తను కూడా సంగీతం నేర్చుకోవాలని అనుకునేది.

ఆ కోర్కె తీరకుండానే పెళ్ళి చేసారు ఇంట్లో వాళ్ళు. అదీ బలవంతంగానే.

నిజానికి రాజు పక్కన పెళ్ళి ఫోటోలో..తన ఫోటో వుండేది.

ముప్పై ఐదేళ్ళు వచ్చాక ఈ విషయాలు తల్చుకోవడం..నిజంగా అసహ్యం.

తనకు మధుతో పెళ్లై ఆరేళ్లయింది.

పిల్లాజెల్లా లేరు.

ఓ ఇల్లూ, ఐశ్వర్యం లేదు.

అద్దె ఇంట్లో...ఇరుకు సంసారం.

ఓ చిన్న గుమస్తా ఉద్యోగం.

సెకండ్ హ్యాండ్ స్కూటర్ మీద పోయి వస్తుంటాడు.

ఇంట్లో ఉన్నంతసేపూ ప్రేమాభిషేకాలే- మాటల్తో కోటలు కట్టి- తన్నో మహారాణిని చేసి...మల్లెల పొట్లం విప్పి..వాటితో రథం కట్టి-మంచం వైపు హనీమూన్‌కి తీసుకెళ్తాడు.

ఈ ఆరేళ్ళూ తను ఆనందంగానే వుంది.

కానీ...రాజు పెళ్ళి వార్త చూడగానే గొంతు బొంగురయింది. గుండె తడయ్యింది.

'రాజూ..రాజూ..రాజూ..నువ్వు నాకు దూరమైపోయావు- ఎప్పుడో ఆరేళ్ళ క్రితం... ఇప్పుడు మళ్ళీ శాశ్వతంగా గుండెలోంచి తీసి విసిరేయాలంటే ఎంత కష్టం చెప్పు' అని పూర్ణ గుండె మొత్తుకుంటోంది.

★ ★ ★

''నాకు తెల్సు పూర్ణా! నేను సినిమా పిచ్చిలో పడి దమ్మిడి ఆదాయం లేని వాణ్ణని- మీ ఇంట్లో వాళ్ళు నన్ను ఒప్పుకోరని..నాకు ఎప్పటికైనా బ్రేక్ దొరుకుతుంది- డైరెక్టర్‌గా నా పేరు తెరమీద పడుతుంది''

''కానీ అంతవరకు మావాళ్ళు ఆగరు రాజూ...నేను నీతో వచ్చేస్తా. నన్ను నీతో ఇప్పుడే తీసుకెళ్ళిపో''

రాజు అస్సలు ఒప్పుకోలేదు.

ఇంట్లో పెళ్ళి ప్రయత్నాలు ఆపమని కన్నీళ్లతో చాలా బతిమాలాడు.

పూర్ణ అతనికన్నా ఎక్కువ ఏడ్చింది-అతని ముందూ ఏడ్చింది-తనింట్లోనూ ఏడ్చింది.

ఎన్ని చెంప దెబ్బలు తిందో!

రాత్రింబవళ్ళు కన్నీళ్ళతో స్నానం చేసి-రాజుతో వెళ్ళిపోవడానికి ప్రయత్నం కూడా చేసి...గదిలో బంధించబడి వుంది.

ఆ జైలు నుంచి..మధుతో పెళ్ళి పీటల మీదికి వెళ్ళింది.

మధుసూదన్ మంచోడే కనుక, జీవితం బాగానే నడుస్తోంది.

రాజు పెళ్ళి వార్త చూడగానే గొంతు బొంగురయింది. గుండె తడయ్యింది. 'రాజూ..రాజూ..రాజూ..నువ్వు నాకు దూరమైపోయావు- ఎప్పుడో ఆరేళ్ళ క్రితం... ఇప్పుడు మళ్ళీ శాశ్వతంగా గుండెలోంచి తీసి విసిరేయాలంటే ఎంత కష్టం చెప్పు' అని పూర్ణ గుండె మొత్తుకుంటోంది.

అందులో అసంతృప్తి లేదు.

రాజు ఇప్పుడు ఎలా వున్నాడో నని ఎక్కడున్నాడో అని..పెళ్ళి పీటల మీద కూర్చున్న దగ్గ ర్నుంచి ప్రతీరోజూ తల్చుకుం టూనే వుంది పూర్ణ.

మధు ఆఫీసుకె ళ్ళాక..మధును తల్చుకోవడం తక్కువైనా రాజు మాత్రం పదే పదే గుర్తొస్తూనే ఉన్నాడు.

★ ★ ★

ఇవ్వాళ రాజు పెళ్ళంటే.. నేను పొందుతున్న ఆనందం కన్నా-రాజు అందుకుంటున్న ఆనందాన్ని చూసి ఈర్ష్య పడు తోందా?.. పూర్ణకర్థం కావటం లేదు.

ఒక ఆడపిల్ల తన జీవి తాన్ని-తాను మల్చుకోలేక..సర్దు కోలేక-గడిచిన జీవితాన్ని మరచి పోలేక-వ్యధా వ్యాకుల చిత్తంతో.. ఎంత మధనపడిపో తోందో? పూర్ణ మనస్సుకు ఇప్పుడు అర్థం కాదు.

'గతం తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదోయ్' అన్న మాట పాటని- అబద్ధం చేస్తూ..సౌఖ్యం లేని జీవితాన్ని గడుపుతోంది.

★ ★ ★

పూర్ణలో కలిగిన మార్పును- ఆమె మనసులోని తేడాని మధుసూదన్ గమనిం చాడు.

దాని గురించి పూర్వాపరాలు పరిశీలించాడు.

అత్తమామల్నడిగి కారణా లేవో తెలుసుకున్నాడు. కొన్ని నిజాల్ని ఊహించుకున్నాడు.



భార్య తనతో చెప్పలేకపోతున్న రహస్యాన్ని, ఆవిడ ఇబ్బం దిని..ఒక్కమాటలో చెప్పి..ఒక్క వేలితో ఆమె కన్నీళ్ళు తుడిచి..ఒక్క కౌగిలింతతో గుండెల్లోకి దూర్చేసుకున్నాడు.

ఆ మాట మీకు చెప్పాలి కదూ..!

''పూర్ణా! నీకో మాట చెప్పాలి. నేను గాయని రేఖని ప్రేమించాను. తనను పెళ్ళి చేసుకోవాలని చాలా అనుకునేవాడ్ని. మొన్న ఆమె పెళ్ళి వార్త పేపర్లో చూసినప్పట్నుంచీ నీతో సరిగా వుండట్లేదేమో? అయామ్ సారీ!'' అన్నాడు మధు.

పూర్ణ కన్నీళ్ళు..ఆమె దుఃఖాన్ని కడిగేసాయి.

ఇప్పుడు...పూర్ణ గుండెల్లో రాజు కనిపించడం లేదు.

మధు గుండెల్లో పూర్ణ కనిపిస్తోంది.

రేఖని ప్రేమించడం అబద్ధమని..మధు పూర్ణతో ఎప్పటికీ చెప్ప లేదు.